# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 06-09-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. దేశ అభివృద్ధిలో విద్యావంతులైన మహిళలు కీలక పాత్ర పోషిస్తారని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
2. **న్యాయవాద వృత్తిలో సవాళ్లు సహజమని, ఇందులో ఉండే వారికి మేధస్సుతో పాటు ఆత్మబలమూ అవసరమని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు.**
3. **చిన్నారులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు.**
4. **విద్యాశాఖలో సమగ్ర సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి వెల్లడించారు.**
5. **తెలంగాణలోని హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద ఈరోజు వినాయక విగ్రహాల నిమజ్జనాల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది.**

==========================

దేశాభివృద్ధిలో విద్యావంతులైన మహిళలు కీలక పాత్ర పోషిస్తారని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రపతి నిన్న ఢిల్లీలో ఉత్తమ జాతీయ ఉపాధ్యాయ అవార్డులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ప్రసంగిస్తూ.. బాలికల విద్యకు ప్రతి ఒక్కరూ అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. ఆడపిల్లలకు అత్యుత్తమ విద్యను అందించడమే వారికి ఇచ్చే అమూల్యమైన సంపద అని ఆమె పేర్కొంటూ..

..వాయిస్.. 37 సెకన్లు

---------------------------

న్యాయవాద వృత్తిలో సవాళ్లు సహజమని, ఇందులో ఉండే వారికి మేధస్సుతో పాటు ఆత్మబలమూ అవసరమని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి జిల్లా సబ్బవరంలోని దామోదరం సంజీవయ్య న్యాయ విశ్వవిద్యాలయం-డీఎస్ఎన్ఎల్‌యూ స్నాతకోత్సవం నిన్న విశాఖపట్నంలో నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, డీఎస్ఎన్ఎల్‌యూ ఛాన్సలర్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించి స్నాతకోత్సవ పట్టాలను అందజేశారు.

---------------------------

దేశంలోనే ఉత్తమ విద్యార్థులుగా పిల్లలను తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. విజయవాడలో నిన్న గురుపూజోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు కేవలం పాఠాలు చెప్పడమే కాకుండా వారిలో స్ఫూర్తి నింపి, నైపుణ్యాలను వెలికితీయాలని, నైతిక విలువలు నేర్పాలని ఉపాధ్యాయులకు ముఖ్యమంత్రి సూచిస్తూ..

– వాయిస్..31 సెకన్లు

---------------------------

తెలంగాణలోని హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద ఈరోజు వినాయక విగ్రహాల నిమజ్జనాల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టింది. భారీ సంఖ్యలో పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసింది. విగ్రహాల నిమజ్జనం కోసం అధిక సంఖ్యలో క్రేన్ లను అధికారులు సిద్ధం చేశారు. గణేశ్ విగ్రహాల నిమజ్జనం దృష్ట్యా జీహెచ్ఎంసీ కమిషనర్ ప్రజలకు ముఖ్యమైన సూచనలు చేశారు. గణేశ్ నిమజ్జనం సందర్భంగా జంట నగరాల వ్యాప్తంగా ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. భక్తులు ట్యాంక్ బండ్ కు చేరుకునేందుకు 6 వందల ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

---------------------------

విద్యాశాఖలో సమగ్ర సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని, రాష్ట్రంలో నూతన విద్యా విధానం అమలు చేయడానికి తమ ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అన్నారు. నిన్న గురుపూజోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు హైదరాబాద్ శిల్పకళావేదికలో ఆయన పురస్కారాలను ప్రదానం చేశారు. విద్యాశాఖ అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్నదని అందుకే ఆ శాఖను తానే స్వయంగా పర్యవేక్షిస్తూ.. ప్రతి సమస్యను పరిష్కరిస్తున్నానని ఆయన తెలియజేస్తూ...

వాయిస్..29 సెకన్లు

---------------------------

గత రెండు నెలలుగా ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా తురకపాలెంలో అంతుచిక్కని వ్యాధితో సంభవిస్తున్న వరుస మరణాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వైద్యారోగ్య శాఖాధికారులతో సమీక్షా సమావేశం నిన్న నిర్వహించారు. గ్రామంలో 20 మంది చనిపోవడానికి గల కారణాలపై మొదట దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఈరోజు, రేపు ప్రత్యేక వైద్య బృందాలు తురకపాలెం వెళ్లి అందరికీ నిర్దేశిత 42 వైద్య పరీక్షలు నిర్వహించి సోమవారానికి హెల్త్ ప్రొఫైల్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని సులభతరం చేస్తూ.. పేద, మధ్య తరగతి ప్రజలకు ఊరట కలిగించే నిర్ణయాలు తీసుకోవడం పట్ల పరిశ్రమ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. 56వ వస్తు సేవల పన్ను (జీఎస్టీ) మండలి సమావేశంలో, సామాన్యులు, రైతులు, మధ్యతరగతి, యువతకు నేరుగా ఆర్థిక ఊరట కలిగించేలా జీఎస్టీ శ్లాబ్‌లను సులభతరం చేసి చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నారని ఆంధ్రప్రదేశ్ లోని బాపట్ల జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్

అధ్యక్షులు టి. సురేష్ ఆకాశవాణికి తెలియజేస్తూ...

వాయిస్.. 34 సెకన్లు

---------------------------

ప్రపంచంలో అభివృద్ధి చెందిన నగరాలతో హైదరాబాద్ పోటీ పడుతోందని గ్లోబల్ సిటీగా హైదరాబాద్ రూపాంతరం చెందుతోందని తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డితో డెన్మార్క్ రాయబారి రాస్మస్ క్రిస్టిన్సన్ హైదరాబాద్‌లో నిన్న సమావేశం అయ్యారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఫార్మా రంగాలలో రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను డెన్మార్క్ రాయబారికి మంత్రి ఈ సందర్భంగా వివరించారు. వాణిజ్య, పారిశ్రామిక రంగాలలో భారత్, డెన్మార్క్ దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం కావాలని.. ఆయన ఆకాంక్షించారు.

---------------------------

ప్రో కబడ్డీ సీజన్-12లో యు ముంబా, బెంగళూరు బుల్స్ మధ్య నిన్న ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో మ్యాచ్ జరిగింది. 48-28 పాయింట్ల తేడాతో బెంగళూరు బుల్స్‌పై యు ముంబా గెలుపొందింది. మరో వైపు హరియాణా స్టీలర్స్ 37-32 పాయింట్ల తేడాతో యూపీ యోధాస్ పై గెలిచింది.

---------------------------

పశ్చిమ వాయువ్య దిశగా ఏర్పడిన అల్పపీడన ద్రోణి ఆంధ్రప్రదేశ్ ఒడిషా, తెలంగాణా వైపు కదిలే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రానున్న నాలుగు రోజులపాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి ఎల్.నారాయణ తెలియజేస్తూ...

వాయిస్..19 సెకన్లు

మరోవైపు తెలంగాణలో ఈరోజు, రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో యూరియా సరఫరా సమస్యలపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని వ్యవసాయ శాఖా మంత్రి కె. అచ్చెన్నాయుడు ఆదేశించారు. యూరియా నిల్వలు, పంపిణీ, సరఫరాలపై జిల్లా కలెక్టర్లతో మంత్రి శ్రవణ మధ్యమ సమావేశం నిన్న నిర్వహించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుంచి జరిగిన ఈ సమావేశంలో కృష్ణా, ఎన్టీఆర్, శ్రీకాకుళం, బాపట్ల, విజయనగరం, కడప, ఏలూరు, శ్రీ సత్యసాయి జిల్లాల కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

=====================